ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 03 డిసెంబరు 2024
www.prajaaswaramdaily.com
2 pm

# మహిళా కానిస్టేబుల్ హత్య కేసు..
# పోలీసుల అదుపులో నిందితుడు

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో జరిగిన మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్య కేసులో ఆమె తమ్ముడు పరమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై బీఎన్ఎస్ 103 (1) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పరువు హత్యతో పాటు ఆస్తి వివాదం కోణంలో విచారణ చేస్తున్నారు. పరమేశ్‌కు సహకరించిన నిందితుల కోసం మూడు బృందాలతో ఇబ్రహీంపట్నం పోలీసులు గాలిస్తున్నారు.



## హరీశ్‌రావుపై పంజాగుట్ట పీఎస్‌లో
# కేసు నమోదు

### తన ఫోన్ ట్యాపింగ్ చేశారని.. అక్రమ కేసులు పెట్టి వేధించారని చక్రధర్ ఫిర్యాదు



హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావు పై కేసు నమోదైంది. సిద్దిపేటకు చెందిన చక్రధర్ ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హరీశ్‌తోపాటు అప్పటి టాస్క్‌ఫోర్స్ డీజీ రాధాకిషన్‌రావుపైనా కేసు నమోదైంది. తన ఫోన్ ట్యాపింగ్ చేశారని.. అక్రమ కేసులు పెట్టి వేధించారని చక్రధర్ ఫిర్యాదు చేశారు. 120(బి), 386, 409, 506, రెడ్‌విత్ 34, ఐటీ యాక్ట్ కింద హరీశ్‌రావుపై కేసు నమోదు చేశారు.

# కేరళ రాష్ట్రంలో ఘోర ప్రమాదం

### ఐదుగురు మెడికల్ విద్యార్థులు మృతి




తిరువనంతపురం : కేరళ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు మెడికల్ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వందనం మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థులు ఏడుగురు గురువాయుర్ నుంచి కాయంకులంకు కారులో బయల్దేరారు. మార్గం మధ్యలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సును బలంగా ఢీ కొట్టింది. దీంతో ముగ్గురు ఎంబీబీఎస్ విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మిగతా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మిగతా ఇద్దరిని అలప్పుజ జిల్లా మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులను మహమ్మద్, ముహసిన్, ఇబ్రహీం, దేవానంద్, శ్రీదీప్‌లుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో బస్సులోని నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.




## టెలీమెట్రీ స్టేషన్ల తో
# నీటి లెక్క పక్కా..

### త్వరలో కేఆర్ఎంబీ బోర్డు సమావేశంలో చర్చకు ప్రభుత్వం సిద్ధం

### ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడకుంటుందో లెక్కలు తీయాలన్న సీఎం రేవంత్

### కసరత్తులో అధికారులు

హైదరాబాద్ : టెలీమెట్రీ స్టేషన్ల ఏర్పాటు అంశాన్ని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించేందుకు... రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. నీటి వినియోగం విషయంలో జరుగుతున్న అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని... కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులన్నింటి ద్వారా ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడుకుంటుందో లెక్కలు తీయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. రెండో దశ టెలీమెట్రీ స్టేషన్ల ఏర్పాటుతో పాటు మొదటి దశలోని పరికరాల మార్పు ప్రతిపాదనపై చర్చించనుంది.

మొదటి దశలో 18 టెలీమెట్రీ స్టేషన్లను ఏర్పాటు చేశారు. జూరాల, కోయిల్ సాగర్, నెట్టెంపాడు, బీమా, కల్వకుర్తి, శ్రీశైలం ఓట్‌లెట్, పాలేరు జలాశయం, నాగార్జున సాగర్ కాల్వలు, ఏఎమ్మార్పీ లింక్ ఎత్తిపోతల, పాలేరు జలాశయం ఔట్ లెట్లు ఈ జాబితాలో ఉన్నాయి. రెండో దశలో 9 టెలీ మెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేయాలని 2018 అక్టోబర్లో జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయించారు.

### సెన్సర్స్ లేకుండా డప్లర్ కరెంట్ ప్రొఫైలర్స్..

తొలి దఫాలో సెన్సర్స్ కాకుండా సైడ్ లుకింగ్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్స్, ఎస్ ఓల్డీ సీపీలను అమర్చాలని నిర్ణయించారు. అందుకను గుణంగా అంచనాలను రూపొందించారు. సాగర్ కుడి, ఎడమ కాల్వలు, పాలేరు జలాశయంపై మరోచోట పోటిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన, పోలవరం కుడి కాలువ కలిసే చోట కేసీ కెనాల్ ప్రకాశం బ్యారేజీ పశ్చిమ కాల్వలు ఈ జాబితాలో ఉన్నాయి. మొదటి దశలోని గుంటూరు చానల్, సాగర్ టెయిల్ పాండ్, ఆర్డీఎస్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ వద్దస్టేషన్లలోని సెన్సర్స్ స్టానంలో డాప్లర్ల ఏర్పాటుక ప్రతిపాదనలు చేశారు. మొదటి విడుతలో ఏర్పాటు చేసిన 18 టెలీమెట్రీ స్టేషన్లు 2019లో పూర్తయ్యాయి. నిధుల సమస్యలతో రెండో విడత స్టేషన్లు ఏర్పాటు చేపట్టలేదు. అప్పటి నుంచి ప్రతి బోర్డు సమావేశంలో ఈ అంశం చర్చకు వస్తున్నప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. మొదటి విడతలో ఏర్పాటు చేసిన సెన్సర్స్ స్థానంలో డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్స్‌ను ఏర్పాటు చేయాలన్న నిర్లయం కూడా ముందుకు సాగలేదు. రెండు రాష్ట్రాలు వినియోగిస్తున్న కృష్ణ జలాల అంశానికి సంబంధించిన పక్కా గణంకాలు లేకుండా పోయాయి. రెండు రాష్ట్రాలు భిన్న వాదనలు వినిపిస్తున్న పరిస్థితి ఏర్పడింది. త్వరలో జరిగే కృష్ణ బోర్డు యాజమాన్య సమావేశంలోను రెండో దశ టెలీమెట్రీ స్టేషన్ ల ఏర్పాటు అంశాన్ని ఎజెండాలో పొందుపర్చారు. రెండో విడత కోసం రూ. 6. 25కోట్లు అవసమని అంచనా వేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం నిర్వహించిన నదిజలాల సమీక్షలో టెలీమెట్రీ స్టేషన్ల అంశం ప్రస్తావనకు వచ్చింది. కోటాకు మించి ఎక్కువ నీటిని ఏపీ తరలిస్తోందని చర్చించారు. నీటి ప్రవాహాన్ని శాస్త్రీయంగా లెక్కించే టెలీమెట్రీ విధానంతో అడ్డుకట్ట వేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరికరాలకయ్యే రూ. 12 కోట్లను రెండు రాష్ట్రాలు చెరి సగం చెల్లించాలని ముఖ్యమంత్రికి వివరించారు. అవసరమైతే ముందుగా తాముభరించి ఈ విధానం అమలులోకి తీసుకురావాలని ఏపీ రీయింబర్స్ చేసినప్పుడు తీసుకోవాలని సూచించారు.

# సీఎంను కలిసిన తలసాని

### సోదరుడి కుమార్తె వివాహానికి ఆహ్వానం



హైదరాబాద్ : సీఎం రేవంత్ ను మాజీమంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కలిశారు. తన సోదరుడి కూతురి వివాహానికి ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ లోని సీఎం ఇంటికి వెళ్లి పెళ్లిపత్రికను స్వయంగా అందించారు.

# కొండగట్టు అంజన్న సన్నిధిలో మెగా హీరో



జగిత్యాల : కొండగట్టు అంజన్న ఆలయాన్ని మెగా హీరో వరుణ్ తేజ్ సందర్శించారు. మంగళవారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న వరుణ్ తేజ్‌కు అర్చకులు, అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో వరుణ్ తేజ్ ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంజన్నను దర్శించుకోవడం ఆనందంగా ఉందని వరుణ్ తేజ్ తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల్లో
# 1.21 లక్షల ఐటీ రాబడి

### ఇన్ కం ట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మధుస్మిత

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్షా 21వేల కోట్ల ఆదాయ పన్ను వసూలు చేయాలనే..లక్ష్యం పెట్టుకున్నట్లు ఇన్ కం ట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుస్మిత తెలిపారు. ఎఫ్టీసీసీఐ ఆధ్వర్యంలో... "ఆదాయ పన్నులో ఫేస్ లెస్ అసెస్ మెంట్, వివాద్ -సే-విశ్వాస్ స్కీమ్" అనే అంశంపై జరిగిన సమావేశంలో మధుస్మిత పాల్గొన్నారు. ప్రస్తుతానికి 59వేల కోట్ల మార్కును చేరుకున్నామని పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజోపయోగ కార్యక్రమాల కోసం ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న క్రమంలో ఎక్కువ ఆదాయాన్ని సేకరించడం తమ కర్తవ్యమన్నారు. ఆదాయ పన్ను శాఖకు ప్రజలు సహకరించాలని మధుస్మిత కోరారు